
# * పాపం.. తెలుగు హీరోయిన్ *

సరోజ ని అనుకోకుండా అదృష్టం వరించింది. ఆ అమ్మాయి హఠాత్తుగా హీరోయిన్ అయిపోయింది. అదెలాగంటే...

ఆరోజు సరోజ తన స్నేహితురాలి పెళ్లికి శ్రీనగర్ కాలనీకి వెళ్లింది. అప్పటికే పెళ్లిపందిరి అంతా జనంతో నిండి వుండడంచేత చివరగా ఉన్న ఓ కుర్చీలో కూర్చుంది సరోజ.




కాస్సేపు పెళ్లి చూడ్డంలో సీరియస్‌గా మునిగిపోయింది. అలా ఏకాగ్రతతో స్నేహితురాలి పెళ్లిచూస్తున్న సరోజ ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

"అమ్మా!....."

తన పక్కనే గేదె అరిచింది. ఛీఛీ... పెళ్లి పందిట్లోకి గేదెలు జొరబడి పోతుంటే ఎవ్వరూ పట్టించుకోరేం? అని విసుక్కుంటూ పక్కకి తిరిగి చూసింది.

అక్కడ గేదెలేదుగానీ గేదెలాంటి మనిషి ఒకతనున్నాడు. సరోజ తనవంక చూడగానే అతను చెవులదాకా నవ్వాడు.

"నువ్విప్పుడు ఇక్కడికి గేదె వచ్చిందేమోనని చూశావ్ కదూ.... అసలిక్కడికి గేదె రానే రాలేదు..... ఇందాక అమ్మా అని పిల్చింది నేనే...." గుడగుడా నవ్వాడు అతను.

"నేన్నమ్మను.....ఇందాక అమ్మా అని అన్నది గేదే.... హబ్బా! నన్నే బురిడీ కొట్టించాలని అనుకుంటున్నారేం?...." అంది సరోజ తలా, కళ్లూ తిప్పుతూ.

ఆయన పొట్ట పట్టుకుని కింద కూర్చుండిపోయి మళ్లీ గుడగుడా నవ్వాడు. తర్వాత కిందినుండి లేచి బట్టలకంటిన మట్టిని దులుపుకుంటూ అన్నాడు - "నాకు తెల్సమ్మా...ఆ నిజాన్ని నువ్వు నమ్మలేవు..... కావలిస్తే నిన్ను మళ్లీ పిలుస్తా చూడూ..."

"పిలవండి చూద్దాం."

"అమ్మా!"

అరే !.... ఆయనలా పిలుస్తుంటే అచ్చు గేదె అరచినట్టుగానే వుందే !!......

సరోజ ఆశ్చర్యంతో నోరు తెరిచింది.

ఆయన హఠాత్తుగా నేలమీద దభీమని కుప్పకూలిపోయాడు.

సరోజ కంగారుపడిపోయింది.

"అరెరె.....ఏమైందండీ?" అని ఆత్రుతగా ముందుకువంగి అతనిని ప్రశ్నించింది.

"నువ్వు ఆశ్చర్యంగా నోరుతెరిచావ్‌గా! అందుకు నా బుర్ర తిరిగి కిందపడ్డా..... సరేగానీ నువ్వు పళ్లు దేంతో తోముకుంటావమ్మా?" సరోజవంక అయోమయంగా చూస్తూ కిందినుండి లేచి నిలబడి అడిగాడు ఆయన.

ఆ మాట వింటూనే సరోజ సిగ్గుపడిపోయింది.

"దేంతోనో తోముకుంటాలెండి.... సరేగానీ నన్ను గేదెలా ఎందుకు పిలిచారూ?...." మెల్లగా అడిగింది.

"చూడమ్మా..... నీ కనుముక్కు తీరు బాగుంది....నీకు సినిమాల్లో వేషం వెయ్యడం అంటే ఇష్టమేనా?" అడిగాడు ఆయన.

"ఇంతకీ మీరెవరు?" సందేహంగా అడిగింది సరోజ.

"నన్ను సినిమా పత్రికల్లో చూడలేదామ్మా? నేను సినీ దర్శకుడిని, వీరబ్రహ్మాం నా పేరు...."

సరోజ అతని మొహంవంక తేరిపార చూసింది.

'ఇందాకట్నుండీ ఈ మొహాన్ని ఎక్కడో చూశానని అనుకుంటున్నా.... అయితే ఆయన ప్రముఖ దర్శకుడు వీరబ్రహ్మాం అన్నమాట!!'

సరోజ సంతోషంతో ఒక్క గెంతు గెంతింది.

"ఏమ్మోవ్!.... ఇలాగైతే నీకు సిన్మాలో ఛాన్సివ్వనంతే ......" వీరబ్రహ్మం గట్టిగా అరిచాడు.

"ఇప్పుడు నేనేం తప్పుచేశానబ్బా!" అని ఆశ్చర్యపోతూ కళ్లు తెరిచి చూసి నాలుక కరుచుకుంది సరోజ.

ఆమె వీరబ్రహ్మం భుజాలమీద వుంది.

కంగారుగా ఆయన భుజాలమీదినుండి కిందికి దూకి "సారీ అండీ!" అంది సరోజ.

"ఏం సారీనో.... నా గూళ్లు బద్దలయిపోయాయ్. ఎంత సంతోషం అయితే మాత్రం అంతగా ఎగరాలా? ఎగిర్తే ఎగిరావ్.....నా భుజాలమీద పడేలా ఎగరాలా?" అన్నాడు వీరబ్రహ్మం మెడ రుద్దుకుంటూ.

"సారీ అండీ!......" అంది సరోజ మరోసారి.

"ఇంతకీ మీ సినిమాలో నాకు ఏ వేషం ఇవ్వాలని అనుకుంటున్నారండీ?" కుతూహలంగా అడిగింది.

"ఉండు..... ఇప్పుడే చెప్తా....." అని చెప్పి దూరంగా వెళ్లి అక్కడినుండి చెప్పాడు వీరబ్రహ్మం.

"నీకు హీరోయిన్ వేషం ఇద్దామని అనుకుంటున్నా...."

"సరోజ సంతోషం పట్టలేక గిలగిల్లాడిపోతూ "హెయ్య్...." అంటూ పెద్ద గెంతు గెంతింది."

"హమ్మనాయ్‌నో....." అంటూ పెద్దగా కేకపెట్టాడు డైరెక్టర్ వీర బ్రహ్మం. "ఇంత దూరం వచ్చి చెప్పినా మళ్లీ నా భుజాలమీదికే గెంతేశావ్ కదమ్మా.....ఇంకా చూస్తావ్?....కిందికి దిగూ....."

"సారీ అండీ!....." అంటూ అతని భుజాలమీదినుండి కిందికి దూకింది సరోజ.

ఆవిధంగా సరోజ ఓ తెలుగు సినిమాలో బుక్ అయి, హీరోయిన్ అయింది.

ఆ మర్నాడు దర్శకుడు వీరబ్రహ్మం కోరినవిధంగా హోటల్ రూంలో ఆయన్ని కలవడానికి వెళ్లింది సరోజ. రూమ్‌లో ఆయనతోబాటు నిర్మాత తిమ్మరాజు ఉన్నాడు. వీరబ్రహ్మం అతన్ని సరోజకి పరిచయం చేశాడు. సరోజ అతనికి నమస్కరించింది.

"ఎలా వుంది మన సెలక్షన్?" కళ్లు ఎగరేసి అడిగాడు వీరబ్రహ్మం తిమ్మరాజువంక చూస్తూ.

తిమ్మరాజు సరోజవంక తేరిపారచూశాడు.

"కానీ....మరేమో.....అమ్మాయి కాస్త పీలగా వున్నట్టుందికదా?....." అన్నాడు నసుగుతూ.
ఆ మాట వింటూనే వీరబ్రహ్మాం గుడగుడా నవ్వాడు.
"ఈ అమ్మాయిని ఇట్టానే వదుల్తామని అనుకున్నావా? ఎక్కడబట్తే అక్కడ ప్యాడ్స్ కట్టేసి పుష్టిగా తయారుచేస్తాం.....నువ్వేం భయపడకు...."
"అవునండీ తిమ్మరాజుగారూ!... మీరు ప్యాడ్స్ కట్టుకోమంటే కట్టుకుంటా... ఏం కట్టుకోమంటే అది కట్టుకుంటా..." అది సరోజ.
"ఈమెకి జుట్టుకూడా పల్చగా వున్నట్టుంది...." మళ్లీ నసిగాడు తిమ్మరాజు.
"హబ్బా.... జట్టు పల్చగా వుంటే విగ్గు పెడ్తాంలేవయ్యా!" అన్నాడు వీరబ్రహ్మాం.
"అవునండీ....మీరు విగ్గుపెట్టు కోమంటే విగ్గు పెట్టుకుంటాను.... సవరాలు పెట్టుకోమంటే సవరాలు పెట్టుకుంటాను...." అంది సరోజ తిమ్మరాజుతో.
"ఈమె గొంతుకూడా అంత బాగున్నట్టు లేదే....." నసగడం మానలేదు తిమ్మరాజు.
"గొంతు బాగోపోయినా డైలాగులు చెప్పలేకపోయినా వేరేవాళ్లచేత డబ్బింగ్ చెప్పిస్తాం లేవయ్యా!...." అన్నాడు. డైరెక్టర్ వీరబ్రహ్మాం.
"ఇలా చేసేకంటే అన్నీ వున్నవాళ్లనే హీరోయిన్‌గా తీస్కోవచ్చుకదండీ బాబూ!" నెత్తి కొట్టుకున్నాడు తిమ్మరాజు.
"అబ్బబ్బ... మీలాంటి కొత్త ప్రొడ్యూసర్లతో ఇదేనయ్యా చిక్కు! ఏ విషయమూ సరిగా అర్థం కాదు.... అన్నీ ఉంటే మనం ఎందుకిక్కడ వున్నదీ? మనం వున్నది లోటుపాట్లు కవర్ చేయడానికే కదా?.... నవ్వు చెప్పేది పాతకాలం హీరోయిన్ల గురించి. పాతకాలం హీరోయిన్లకి అందం వుండాలి. నటన వచ్చి వుండాలి. వాచకం సరిగా వుండాలి..... ఇప్పటి హీరోయిన్‌కి స్టెప్పులెయ్యడం వస్తేచాలు....ఇంకేం అక్కర్లేదు...." విసుక్కుంటూనే విడమర్చి చెప్పాడు వీరబ్రహ్మాం.
"మరీ ఈ అమ్మాయికి స్టెప్పులెయ్యడం వచ్చో రాదో....." సందేహంగా అన్నాడు తిమ్మరాజు.
"స్టెప్పులెయ్యడం గొప్ప విద్యా? నీ కళ్లముందే ఈ అమ్మాయితో స్టెప్పులేయిస్తా చూడు..... " తిమ్మరాజుతో అని సరోజ వైపుకు తిరిగాడు వీరబ్రహ్మాం.
"చూడమ్మా, నీకెప్పుడైనా సెగ్గడ్డలు వచ్చాయా?" అడిగాడు వీరబ్రహ్మాం.

"ఓ - వచ్చాయండి.... ఓసారి కన్నుమీద వచ్చిందండి. ఓసారి బుగ్గమీద వచ్చిందండి." చెప్పింది సరోజ.

"చంకల్లో వచ్చాయా?"

"రాలేదండి...."

"నువ్విప్పుడేం చేస్తావంటే చంకల్లో సెగ్గడ్డలు వచ్చినట్లు చేతులు రెండూ కాస్త పైకి పెట్టి నిలబడు."

డైరెక్టరుగారు చెప్పినట్టే చంకలు పైకెత్తి నిలబడింది సరోజ.

"నేనిప్పుడు నోటితో మ్యూజిక్ ఇస్తాను. నువ్వట్టానే చేతులు పైకుంచి థెయ్యిథెయ్యిమంటూ గెంతాలి. ఊ గెంతూ... లబ్జులకిడి... లబ్జులకిడి... లబ్జులకిడి..."

సరోజ అతని నోటి మ్యూజిక్‌కి తగినట్లు అలా చంకలు ఎత్తిపట్టి వుంచే గెంతింది.

"అంతే!... అవే స్టెప్స్!!" తిమ్మరాజువంక చూస్తూ అన్నాడు వీరబ్రహ్మం. తిమ్మరాజు సంతృప్తిగా తల ఊపాడు.

"సార్... మన సినిమాలో హీరో ఎవరు సార్?" కుతూహలంగా అడిగింది సరోజ.

"కళా కురూపి కోతి హనుమంతరావమ్మా!" చెప్పాడు వీర బ్రహ్మం. సరోజ గుండెలు ధన్‌ధన్‌మని బాదుకుంది.

"హబ్బా!... ఆయనా? ఆయన నా అభిమాన హీరో అండీ... ఏముందేవండీ... ఇంకా మన సినిమాలో ఏయే నటీనటులుంటారండీ...?" వీరబ్రహ్మం చెప్పాడు.

"అదేంటండి, మన సినిమాలో జైమాల్ని అన్రాదా అలాంటివాళ్లు లేరేం?" ఆశ్చర్యంగా అడిగింది సరోజ.

వీరబ్రహ్మం పొట్టపట్టుకుని గుడగుడా నవ్వాడు.

"వాళ్లుంటే నువ్వేం చేస్తావ్?" అన్నాడు నవ్వాపుకుంటూ.

సరోజ తెల్లబోయి చూసింది.

"పాతకాలం సినిమాల్లో వాళ్లు వుండేవారు. ప్రస్తుతం హీరోయినే అన్నీ చేస్తుంది. నీకే సినిమాలో ఒక పాటలో ఈత డ్రెస్సుంది. దాన్ని రెండు రుమాళ్లతో కుట్టేస్తున్నాము. ముత్యాల చెడ్డీ వేస్కుని ఒకటీ, చెమ్కీ చెడ్డీ వేస్కుని ఒకటీ, చీలికల లంగా వేసుకుని మరొకటీ - ఇలా మూడు క్లబ్బుడాన్సులు ఉన్నాయ్ నీమీద. ఇహపోతే చెర్లో మునుగుతూ ఒకటీ, వానలో తడుస్తూ ఒకటీ - రెండు పాటలు వున్నాయ్...

అంచేత అన్రాదా, జైమాల్నీలు మనకి అవసరంలేదు."
"ఏవండీ... మన సినిమా కథని కాస్త చెప్తారా?" అడిగింది సరోజ.
వీరబ్రహ్మం ఆమెకి కథ టూకీగా చెప్పాడు.
"అర్రే!... ఈ కథలో నా పాత్రే లేదు కదండీ!!!" ఆశ్చర్యంగా అంది సరోజ.
వీరబ్రహ్మం గుడగుడా, తిమ్మరాజు ఘొల్లుమనీ నవ్వారు.
"నువ్వెక్కడో వెర్రిబాగుల్దానిలా ఉన్నావ్!... తెలుగు సినిమాల్లో హీరోయిన్లకి కథతో సంబంధం ఉంటుందా ఎక్కడైనా? హీరో వెంట ఉండి స్టెప్పులేసి డాన్సులు వెయ్యడమే హీరోయిన్ల పని... తెల్సిందా? ... ఇలాంటి పిచ్చి సందేహాలు పెట్టుకోకు... భవిష్యత్తు పాడైపోద్ది."
సరోజ బుద్ధిగా తలూపింది.
వీరబ్రహ్మం తీసిన సినిమా బ్రహ్మాండంగా హిట్టయింది. దాంతో సరోజ చాలా సినిమాల్లో బుక్ అయింది. కొన్నాళ్ళకి సరోజ గొప్ప హీరోయిన్ అయిపోయింది. ఆమెకి ఓ సంస్థ 'కళా తాటకి' అనే బిరుదు కూడా ఇచ్చి సన్మానించింది.

* * *